

భద్రతకు భరోసా

ఏలూరు జిల్లాలో అక్కాచెల్లెమ్మలకు, బాధిత మహిళలకు పోలీస్ శాఖ రక్షణ కవచంలా నిలిచి సత్వర న్యాయం 'దిశ'గా అడుగులు వేసింది. 8లో ▸



గంజాయి పట్టివేత

జీలుగుమిల్లిలో రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద బుధవారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో దాదాపు 220 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 8లో ▸



వర్జీనియా సాగు పరిశీలన

జంగారెడ్డిగూడెం వర్జీనియా వేలం కేంద్రం -1,-2 పరిధిలోని పలు గ్రామాలలో వర్జీనియా క్షేత్ర మిత్ర బృందం గురువారం పర్యటించింది. 8లో ▸

న్యూస్‌రీల్

సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహం ఆవిష్కరణ



సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: చరిత్రలో గొప్పవారి త్యాగాల గురించి తెలుసుకోవాలని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని నీలాద్రిపురంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల కోసం పోరాడిన వారిలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఒకరని పేర్కొన్నారు. బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదని, రాజకీయ పార్టీలకు వెన్నుముక అన్నారు. వారికి తగిన న్యాయం చేశారన్నారు. పాపన్నగౌడ్ వంటి వారి గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం పాపన్నగౌడ్ చరిత్ర పుస్తకాన్ని డిప్యూటీ సీఎం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు చలపాటి వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు తాతా శ్రీనివాసరావు, జై గౌడ ఉద్యమం జాతీయ అధ్యక్షుడు వట్టికూటి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాం ఏర్పాట్ల పరిశీలన



జగనన్నకు చెబుదాం ఏర్పాట్లను పరిశీలించిన సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

ఆగిరిపల్లి: శుక్రవారం జరగనున్న జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం ఏర్పాట్లను సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పరిశీలించారు. ఆగిరిపల్లిలో పాస్నం కళ్యాణ మండపంలో నిర్వహించే కార్యక్రమానికి ఏర్పాటు పూర్తి చేసినట్లు సబ్ కలెక్టర్ తెలిపారు. ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్న కలెక్టర్ దృష్టికి మండలంలోని ప్రజలు తమ అర్జీలు సమర్పించాలన్నారు. ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం జరుగుతుందన్నారు.

జనవరిలో నరసాపురం-హుబ్లీ రైలు

పాలకొల్లు సెంట్రల్: జనవరి మొదటి వారంలో నరసాపురం నుంచి హుబ్లీకి కొత్త రైలు ప్రారంభించనున్నారు. గురువారం విజయవాడ జోన్ డీఆర్‌యుసీసీ సభ్యుడు జక్కంపూడి కుమార్ మాట్లాడుతూ వాణిజ్య పరంగా, ఉపాధి నిమిత్తం బళ్లారి, హోస్పెట, నంద్యాల ప్రాంతాల్లో ఉంటున్న బంధువులకు ఈ హుబ్లీ రైలు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఉభయ గోదావరి జిల్లాల ప్రజలు ఈ ప్రాంతాలకు వెళ్లాలంటే బస్సులోనే వెళ్లాల్సి వస్తుందని లేదంటే విజయవాడ వెళ్లి అక్కడి నుండి హుబ్లీ రైలు ఎక్కాల్సి వస్తుందన్నారు. నరసాపురం నుంచి నేరుగా హుబ్లీ రైలు ఏర్పాటుచేయడం శుభపరిణామమని తెలిపారు. ఈ రైలు జనవరి మొదటి వారం నుంచి ప్రతీ రోజు నరసాపురం నుంచి బయలుదేరుతుందన్నారు. సమయం రెండు రోజుల్లో రైల్వే అధికారులు ప్రకటిస్తారన్నారు. కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వచ్చె నెల మొదటి వారంలో నరసాపురంలో రైలును ప్రారంభిస్తారని తెలిపారు.

మూగజీవిని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది



బావిలోంచి ఆవును బయటకు తీస్తున్న దృశ్యం

భీమడోలు: పూళ్లలో ఓ బావిలో పడిన ఆవును అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. గ్రామానికి చెందిన గండు నాగరాజు ఆవు బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తు 35 అడుగుల లోతులో ఉన్న బావిలో పడిపోయింది. రైతు నాగరాజు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో భీమడోలు అగ్నిమాపక అధికారి నాగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ఆవుకు ఎలాంటి గాయాలు కాకుండా స్థానికుల సాయంతో రెండు గంటల పాటు శ్రమించి సురక్షితంగా బయటకు తీశారు. మూగజీవిని కాపాడిన అగ్నిమాపక సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు.

ఉన్నత చదువులకు భరోసా

- గత నాలుగేళ్లలో విద్యాదీవెనలో రూ.383.42 కోట్ల లబ్ధి
- జగనన్న వసతి దీవెనలో రూ.142.96 కోట్ల ప్రయోజనం
- నేడు భీమవరంలో విద్యాదీవెన నిధులు విడుదల చేయనున్న సీఎం
- ఏలూరు జిల్లాలోని 29,111 మంది విద్యార్థులకు రూ.22.45 కోట్ల లబ్ధి



జగనన్న వసతి దీవెన పథకంలో చెక్కును అందిస్తున్న దృశ్యం(ఫైల్)

ఏలూరు (టూటౌన్): విద్యార్థుల ఉన్నత చదువులకు ప్రభుత్వం భరోసా కల్పిస్తుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్యా, వసతి దీవెన లబ్ధి వారికి అక్కరకు వస్తున్నాయి. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఎంబీబీఎస్, డిప్లమో వంటి కోర్సులు చదివే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు, అగ్రవర్ణ పేదల చదువులకు ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగేందుకు ప్రభుత్వం పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అందిస్తుంది. దీనికి తోడు జగనన్న వసతి దీవెన పేరుతో రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకూ ఆర్థిక సాయం అందిస్తుంది. ప్రభుత్వ సహకారం వల్ల తమలాంటి పేద, మధ్యతరగతి విద్యార్థుల ఉన్నత విద్య కల నెరవేరుతుందంటూ ఆయా వర్గాల విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నాలుగు సంవత్సరాలు క్రమం తప్పకుండా విద్యా, వసతి దీవెనల పథకాల ద్వారా ఏలూరు జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో విద్యార్థులు ప్రయోజనం పొందుతున్నారు. ఇంతవరకూ జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా జిల్లాలో రూ.383.42 కోట్లు, వసతి దీవెన పథకం ద్వారా రూ.142.96 కోట్లు మేరకు విద్యార్థులకు ప్రయోజనం చేకూరింది. శుక్రవారం భీమవరంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా 2023 సంవత్సరం జూలై- సెప్టెంబర్ క్వార్టర్‌కు జగనన్న విద్యాదీవెనకు సంబంధించి ఏలూరు జిల్లాకు రూ.22.45 కోట్లు విడుదల చేయనున్నారు.

విద్యాదీవెనలో రూ.383.42 కోట్ల లబ్ధి

జగనన్న విద్యాదీవెన పథకంలో గత నాలుగేళ్ల నుంచి ఇంతవరకూ ఏలూరు జిల్లా వ్యాప్తంగా రూ.383.42 కోట్ల ప్రయోజనం చేకూరింది. 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.95.78 కోట్లు, 2020-21లో రూ.77.37 కోట్లు, 2021-22లో రూ.105.67 కోట్లు, 2022-23లో రూ.103.98 కోట్ల లబ్ధి చేకూరింది.

సంవత్సరం	జగనన్న విద్యాదీవెన	
	విద్యార్థులు	లబ్ధి (రూ.కోట్లలో)
2019-20	36,527	95.78
2020-21	37,148	77.97
2021-22	38,677	105.67
2022-23	33,655	103.98
	1,46,007	383.42

వసతి దీవెనలో రూ.142.96 కోట్ల లబ్ధి

వసతి దీవెనలో గత నాలుగేళ్లలో రూ.142.96 కోట్ల ప్రయోజనం చేకూరింది. 2019-20లో 36,580 మందికి రూ.36.86 కోట్లు, 2020-21లో 37,750 మందికి రూ.35.76 కోట్లు, 2021-22లో 36,350 మందికి రూ.34.76 కోట్లు, 2022-23లో 32,316 మందికి రూ.30.96 కోట్ల లబ్ధి చేకూరింది.

నా చదువు సాఫీగా సాగిపోతోంది



ప్రభుత్వ సహకారం వల్ల నా ఉన్నత చదువు సాఫీగా సాగిపోతుంది. ఇంజినీరింగ్‌కు పూర్తి స్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం అందిస్తుండటంతో మా కుటుంబానికి ఎలాంటి సమస్య తలెత్తడం లేదు. దీంతో నా చదువు ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగుతుంది. సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం.

– తామరపల్లి మోహన చంద్రిక, ఇంజినీరింగ్ విద్యార్థిని, ఏలూరు

ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది



జగనన్న వసతి దీవెన, విద్యాదీవెనల పథకాలు మాకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ముఖ్యంగా కాలేజీ ఫీజులు చెల్లించేందుకు ఇబ్బంది లేకుండా ఉంది. దీంతో మా చదువులు సాఫీగా సాగుతున్నాయి. మాలాంటి మధ్యతరగతి విద్యార్థుల చదువులు తల్లిదండ్రులకు భారం కాకుండా ఉంది. సీఎం వైఎస్ జగనన్నకు ధన్యవాదాలు.

– సీహెచ్ రసజ్ఞ, ఇంజినీరింగ్ విద్యార్థిని, ఏలూరు

ఉన్నత చదువులకు భరోసా



పేద విద్యార్థుల ఉన్నత చదువులకు జగన్న విద్యా, వసతి దీవెనలు భరోసా కల్పిస్తున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి క్రమం తప్పకుండా విద్యార్థులకు విద్యా, వసతి దీవెన పథకాలతో సహకారం అందిస్తున్నారు. భీమవరంలో జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాల్లో నిధులను సీఎం వైఎస్ జగన్ తన చేతులు మీదుగా విడుదల చేయనున్నారు.

– వి.జయప్రకాష్, జేడీ, సాంఘిక సంక్షేమ శాఖ, ఏలూరు

తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించాలి

కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఏలూరు(మెట్రో): తప్పులులేని ఓటరు జాబితా రూపకల్పనకు బీఎల్‌ఓలు పనిచేయాలని కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ చెప్పారు. జెడ్పీ సమావేశ మందిరంలో గురువారం ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ బీఎల్‌ఓలు, సూపర్ వైజర్ల సమీక్షా సమావేశంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏ చిన్న పొరపాటు జరిగినా ఎన్నికల కమిషన్ చర్యలకు బాధ్యులమవుతామన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించి పరిశీలనా కార్యక్రమం గడువు పొడిగించినందున బీఎల్‌ఓలు మరింత శ్రద్ధగా పరిశీలన చేయాలన్నారు. తుది ఓటర్ల జాబితా విడుదల తేదీ జనవరి 5కి బదులుగా జనవరి 22న ఉంటుందన్నారు. జాబితాలో మార్పులు, సవరణలు, తొలగింపు కోసం అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో ఇతర నియోజకవర్గాల కన్నా తక్కువగా ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 67 శాతం మాత్రమే పోలింగ్ నమోదైందన్నారు. రానున్న ఎన్నికల్లో కనీసం 80 శాతం పోలింగ్ జరిగేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఈఆర్‌ఓ, జెడ్పీ సీఈఓ కె.ఎస్.ఎస్.సుబ్బారావు, అదనపు ఈఆర్‌ఓలు, నగరపాలక సంస్థ కమిషనరు ఎస్.వెంకటకృష్ణ, తహసీల్దారు బి.సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి పెన్షన్ పెంపుపై అవగాహన

9,326 మందికి కొత్త పెన్షన్లు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫెరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, ఎమ్మెల్యేలు అబ్బయ్య చౌదరి, వీఆర్ ఎలీజా

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో 2,33,726 మందికి సంబంధించి 2024 జనవరి నుంచి పెన్షన్ రూ.2,750 నుంచి రూ. 3 వేలకు పెంచడమే కాకుండా మరో 9,326 మందికి కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ చెప్పారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వైఎస్సార్ పెన్షన్ కానుక, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, జనవరి 1 నుంచి నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం, విజయవాడలో జనవరి 19న డా. బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్, ఎమ్మెల్యేలు కొఠారు అబ్బయ్యచౌదరి, ఉన్నమట్ల ఎలీజా, డీఆర్‌డీఏ పీడీ డా.ఆర్.విజయరాజు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జనవరి 1 నుంచి 8 వరకు వైఎస్సార్ పెన్షన్ కానుక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. జనవరి 23న వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమం, ఫిబ్రవరి 5న వైఎస్ఆర్ చేయూత, కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. వైఎస్ఆర్ పెన్షన్ కానుకలో ఏలూరు జిల్లాలో 2,33,726 మందికి వృద్ధాప్య, వితంతు, చేనేత, మత్స్యకార, కల్లుగీత కార్మికులు, చర్మకార్మికులు, ఒంటరి మహిళలకు పెన్షన్ జనవరి 1 నుంచి రూ. 2,750 నుంచి రూ. 3 వేలకు ప్రభుత్వం పెంచిందన్నారు. జిల్లాలో 2,33,726 మంది పెన్షన్లకు పెంచిన మొత్తం కింద ప్రతినెలా అదనంగా రూ. 5.84 కోట్ల అవుతుందన్నారు. జిల్లాలో మిగిలిన ఇతర రకాల పెన్షన్లతో కలిసి మొత్తం 2,87,845 మందికి రూ. 85.94 కోట్లు జనవరి 1 నుంచి పంపిణీ చేస్తారన్నారు. జనవరి నెల నుంచి కొత్తగా 9,326 పెన్షన్లు ఉన్నాయన్నారు. జిల్లాలో వైఎస్సార్ ఆసరా కింద 35,751 సంఘాలకు చెందిన 3,55,358 మహిళలకు నాలుగో విడతగా రూ. 328.34 కోట్లు విడుదల చేస్తారని చెప్పారు. ఫిబ్రవరి 5న వైఎస్ఆర్ చేయూత పథకం ప్రారంభిస్తారని చెప్పారు. ఫిబ్రవరి 5 నుంచి 14 వరకు చేయూత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. జిల్లాలో వైఎస్సార్ చేయూత నాలుగో విడతలో 1,16,046 మంది లబ్ధిదారులకు రూ. 217.58 కోట్లు విడుదల చేస్తారని చెప్పారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



లూథరన్ గ్రౌండ్‌లో హెలీప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, చీఫ్ విప్ ముదునూరి, విప్ గ్రంధి శ్రీనివాస్, కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం భీమవరంలో పర్యటించనున్న నేపథ్యంలో గురువారం శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, కలెక్టర్ ప్రశాంతి ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక గ్రంధి వెంకటేశ్వరరావు జూనియర్ కళాశాల వద్ద లే అవుట్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభా వేదికను, లూథరన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌ను పరిశీలించారు. శుక్రవారం ఉదయం 10.40 గంటలకు లూథరన్ గ్రౌండ్‌కు సీఎం హెలికాప్టర్ చేరుకుంటుందని, అక్కడి నుంచి సభా వేదికకు సీఎం కాన్వాయ్ వెళ్తుందని.. ఈ మేరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అధికారులకు, పోలీసులకు సూచించారు. వేదిక, పబ్లిక్ గ్యాలరీ, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించి సూచనలు, సలహాలు జారీ చేశారు.

పూర్తి రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తున్నాం: గ్రంధి శ్రీనివాస్

నేటి విద్యార్థులే రేపటి భవిష్యత్ అని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బలంగా నమ్మి విద్యకు తన పాలనలో పెద్దపీట వేశారని ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తూ వారి భవిష్యత్తును బంగారు బాటగా తీర్చిదిద్దుతున్నారని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఉదయం 10 గంటలకు భీమవరం లూథరన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ చేరుకుంటారని, అక్కడి నుంచి రోడ్ షో చేస్తూ బైపాస్ రోడ్‌కు ఆనుకుని ఉన్న గ్రంధి వెంకటేశ్వరరావు ప్రభుత్వ జూనియర్ కాలేజీ వెనుక ఏర్పాటు చేసిన బహిరంగ సభకు చేరుకుంటారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు విద్యార్థులు, ప్రజలు ఆయన రాక కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమలు చేశారన్నారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే కాలేజీలకు చంద్రబాబు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను సీఎం జగన్ చెల్లించి పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేస్తున్నారని అన్నారు. ప్రతి విద్యార్థి కూడా బాగా చదివి ఉన్నత స్థితికి చేరుకోవడం వల్ల వారి కుటుంబాలతో పాటుగా రాష్ట్రం కూడా అభివృద్ధి బాటలో ఉంటుందని వెల్లడించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పర్యటనను భారీ స్థాయిలో విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు.

భీమవరంలో ట్రాఫిక్ మళ్లింపు

భీమవరం: శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు డీఎస్పీ బండారు శ్రీనాథ్ తెలిపారు. తాడేపల్లిగూడెం వైపు నుంచి వచ్చే వాహనాలను గొల్లలకోడేరు వంతెన మీదుగా పాలకోడేరు, వేండ్ర, నవుడూరు సెంటర్ నుంచి వీరవాసరం మీదుగా పాలకొల్లు వైపునకు మళ్లిస్తున్నట్లు చెప్పారు. తాడేపల్లిగూడెం వైపు నుంచి ఉండి, కాళ్ల వెళ్లే వాహనాలను కొవ్వాడ అన్నవరం రోడ్డు నుంచి నర్సింహపురం వెంకటేశ్వరస్వామి ఆలయం పక్క నుంచి ఉండి వైపునకు, కాళ్ల వెళ్లే వాహనాలు పెద అమిరం ఎన్టీఆర్ విగ్రహం వైపు మళ్లిస్తున్నట్లు తెలిపారు. కాళ్ల, ఉండి నుంచి లోసరి వైపు వెళ్లే వాహనాలు భీమవరం పాత బస్టాండ్ నుంచి గొల్లవాని తిప్ప మీదుగా లోసరి హైవే వైపునకు, లోసరి నుంచి వచ్చే వాహనాలు హన్సీ కల్యాణ మండపం నుంచి జువ్వలపాలెం రోడ్డుకు వెళ్లాలన్నారు. ఆకివీడు నుంచి వచ్చే భారీ వాహనాలు ఉండి సెంటర్ నుంచి గణపవరం మీదుగా, దిరుసుమర్రు, యనమదుర్రు వైపు నుంచి భీమవరం వచ్చే వాహనాలు సుంకర పద్దయ్యవీధి నుంచి భీమేశ్వరస్వామి ఆలయం, వీరమ్మపార్క్ మీదుగా గునుపూడి వైపునకు వెళ్లేలా ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు తెలిపారు. తాడేరు వైపు నుంచి వచ్చే వాహనాలను గునుపూడి శివాలయం సెంటర్ నుంచి రైల్వే అండర్ బ్రిడ్జి మీదుగా విస్సాకోడేరు వైపునకు పాలకొల్లు వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు వీరవాసరం సెంటరు నుంచి నవుడూరు వైపునకు వెళ్లేలా ఏర్పాట్లు చేసినట్లు డీఎస్పీ వివరించారు. వ్యాపార సంస్థలపై ఎలాంటి ఆంక్షలు లేవని చెప్పారు.

ఏజెన్సీ, మెట్టకు తలమానికం

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



అల్లి కాల్వ వద్ద నేషనల్ హైవే భూసేకరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: తెలంగాణ-ఆంధ్రా బోర్డర్ జీలుగుమిల్లి మండలం తాటాకులగూడెం నుంచి పట్టిసీమ వరకూ చేపట్టనున్న నేషనల్ హైవే నాలుగు రోడ్ల రహదారి పనులు ఏజెన్సీ మెట్టప్రాంతానికి తలమానికంగా ఉండబోతున్నాయని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుట్టాయగూడెం శివారు అల్లికాల్వ వద్ద నేషనల్ హైవే 365 బీబీ రోడ్డు నిర్మాణం భూసేకరణకు సంబంధించిన పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎన్‌హెచ్ రోడ్డు నిర్మాణం పనులకు సంబంధించి బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం, బుట్టాయగూడెం, పోలవరం మండలం ఎల్ఎన్‌డి పేట పరిధిలో బైపాస్ రోడ్డు నిర్మాణం పనులు జరగనున్నాయని అన్నారు. భూసేకరణ చేయనున్నట్లు తెలిపారు. గిరిజన ప్రాంతంలో నేషనల్ హైవే పనుల ప్రాముఖ్యతను ముఖ్యమంత్రి కేంద్రమంత్రుల దృష్టికి తీసుకువెళ్లారని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వినతి మేరకు సుమారు రూ.370 కోట్ల వరకూ నిధులు మంజూరు చేశారన్నారు. ఈ పనులు పూర్తయితే హైదరాబాద్‌కు సులభంగా ప్రయాణం చేయవచ్చన్నారు. పోలవరం ప్రాజెక్టుకు ఈ హైవే రోడ్డు కనెక్టింగ్ రోడ్డుగా ఉండబోతుందని అన్నారు. పోలవరం ప్రాజెక్టు నుంచి రాజమండ్రి, రంపచోడవరం, అడ్డతీగల మీదుగా నేషనల్ హైవే రోడ్డు పనులు ఇప్పటికే పూర్తయ్యాయని చెప్పారు. తహసీల్దార్ శారాశాంతి, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్ సరియం లక్ష్మి, ఎంపీటీసీ తెల్లం రమణ పాల్గొన్నారు.

చిన్నారుల్లో సృజనాత్మకత పెంపొందించాలి



బాలోత్సవంలో బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హేలాపురి బాలోత్సవాల నిర్వహణ ద్వారా చిన్నారుల్లో ప్రతిభను వెలికితీయవచ్చని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. గురువారం స్థానిక సీఆర్ రెడ్డి డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో హేలాపురి బాలోత్సవం- 4వ పిల్లల సంబరాల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతి ప్రధానోత్సవ జ హేలాపురి బాలోత్సవ నిర్వహణ కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్, ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యతోపాటు చిన్నారులను వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా భాగస్వాములు చేయడం ద్వారా వారిలో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయవచ్చని తెలిపారు. ప్రతి తల్లిదండ్రులు వారి పిల్లల పట్ల ప్రేమానురాగాలను పెంచుకోవాలని కనీసం వారితో గడపడానికి సమయం కేటాయించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాప్రమాణాల మెరుగుకు నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా అభివృద్ధి చేసిందని అన్నారు. ఎస్పీ డీ. మేరీ ప్రశాంతి మాట్లాడుతూ విద్యార్థులను విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీల్లోను భాగస్వామ్యం చేయాలని సూచించారు. అనంతరం గెలుపొందిన చిన్నారులకు కలెక్టర్, ఎస్పీ చేతులమీదుగా మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. బాలోత్సవంలో కలెక్టర్ కుమార్తెలు అశ్రిత, అన్విత, ఎస్పీ కుమార్తె హదస్సా పాల్గొని ఆయా పోటీల్లో ప్రతిభ కనబరిచారు. కార్యక్రమంలో హేలాపురి బాలోత్సవ ఆర్గనైజింగ్ సెక్రటరీ జీవీ నరసింహారావు, విద్యాశాఖాధికారి పీ శ్యామ్ సుందర్, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చినవెంకన్న హుండీ ఆదాయం రూ.2.50 కోట్లు


హుండీల నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ హుండీల లెక్కింపు గురువారం అత్యంత కట్టుదిట్టమైన భద్రతల నడుమ జరిగింది. ఈ లెక్కింపులో స్వామివారికి విశేష ఆదాయం సమకూరింది. గడచిన 21 రోజులకు గాను స్వామివారికి రూ.2,50,79,543 ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు చెప్పారు. అలాగే కానుకల రూపేణా భక్తులు సమర్పించిన 338 గ్రాముల బంగారం, 7.906 కేజీల వెండితో పాటు, అధికంగా విదేశీ కరెన్సీ లభించిందన్నారు. అదేవిధంగా లెక్కింపులోకి రాని రద్దు అయిన పాత రూ.2 వేలు, రూ.వెయ్యి, రూ.500 నోట్ల ద్వారా రూ.95,500 లభించినట్టు చెప్పారు. ఈ లెక్కింపులో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కారు డ్రైవర్‌కు ఏడాది జైలు

గన్నవరం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతికి కారకుడైన కారు డ్రైవర్‌కు ఏడాది కఠిన కారాగార జైలుశిక్ష, రూ.3 వేలు జరిమానా విధిస్తూ గన్నవరం 12వ అదనపు మేజిస్ట్రేట్ కోర్టు గురువారం తీర్పు ఇచ్చింది. ప్రాసిక్యూషన్ కథనం మేరకు విజయవాడలోని చిట్టినగర్‌కు చెందిన మెండెం సుబ్బారావు, అతని స్నేహితుడు కోసూరి ఆంజనేయులు 2020 ఏప్రిల్ 13న స్కూటీపై గన్నవరం వచ్చారు. తిరిగి వెళుతున్న వీరిని కేసరపల్లి శివారు దుర్గాపురం వద్ద కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన సుబ్బారావు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసిన గన్నవరం పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన న్యాయస్థానం తాడేపల్లిగూడెంకు చెందిన కారు డ్రైవర్ షేక్ ఖాశీం నేరం రుజువు కావడంతో జైలుశిక్ష, జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో జైలు శిక్ష మరో మూడు నెలలు పొడిగించాలని జడ్జి తీర్పులో పేర్కొన్నట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.ప్రసన్న చెప్పారు.

భద్రతకు భరోసా

- యాసిడ్ దాడిలో నిందితులకు జీవిత ఖైదు
- విజిలెన్స్ తనిఖీలతో జవాబుదారీతనం
- సైబర్ నేరాలపై మరింత అప్రమత్తం
- సెల్‌ఫోన్ రికవరీతో బాధితులకు ఊరట
- నేరాల నిరోధంపై ఏలూరు జిల్లా పోలీసుల ఉక్కుపాదం

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షిస్తూ మహిళల రక్షణకు భరోసాగా నిలుస్తోంది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం. అక్కాచెల్లెమ్మలకు, బాధిత మహిళలకు పోలీస్ శాఖ రక్షణ కవచంలా ఉంటూ సత్వర న్యాయం 'దిశ' గా అడుగులు వేస్తోంది. ఏలూరు నగరంలో యాసిడ్ దాడిలో మహిళ మృతి చెందితే కేవలం 117 రోజుల్లోనే నిందితులకు జీవితఖైదు విధించేలా పోలీస్ అధికారుల చేపట్టిన పగడ్బందీ చర్యలు నేరస్తుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించాయి.. ఇక జిల్లాను సారా రహితంగా తీర్చిదిద్దటం, గంజా, మద్యం అక్రమ రవాణాపై సెబ్ అధికారులు డేగ కళ్లతో నిశిత పరిశీలన, దాడులు.. మరోవైపు పీడీఎస్, పెస్టిసైడ్స్, ఫెర్టిలైజర్స్, దుకాణాలపై విజి'లెన్స్'.. సామాన్య, మధ్య తరగతి వర్గాలు పోగొట్టుకున్న ఫోన్లను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కనిపెట్టి బాధితులకు అందజేసే బృహత్తర కార్యక్రమం.. ఆన్‌లైన్‌లో మోసాలకు చెక్ పెట్టేలా సైబర్ క్రైమ్ టీమ్ చేస్తున్న కృషి.. ఇలా ఒక్కటేమిటీ ఏలూరు జిల్లా 'పోలీస్' విశేష కృషి చేస్తోంది.



మరో చరిత్రకు నాంది

ఏలూరులో యడ్ల ఫ్రాన్సిక అనే మహిళపై యాసిడ్ దాడి జరిగిన 48 గంటల్లోనే నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు సీసీ కెమెరాలకు సైతం దొరక్కకుండా పక్కా ప్రణాళికతో యాసిడ్ దాడి చేస్తే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను పట్టుకున్నారు. కేవలం 21 రోజుల్లోనే చార్జిషీట్ దాఖలు చేసి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి కేవలం 117 రోజుల్లోనే ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు విధించేలా చర్యలు చేపట్టారు. ఒక్కో నిందితుడికి మూడు జీవిత ఖైదు శిక్షలు విధించటం గమనార్హం.


ఏలూరులో దిశ యాప్‌పై అవగాహన ర్యాలీ (ఫైల్)

దిశ యాప్‌తో మహిళలకు రక్షణ

మహిళలకు రక్షణ కవచంలా దిశ యాప్, దిశ పోలీస్ స్టేషన్లను ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో మహిళలకు భద్రత మరింత రెట్టింపు అయింది. దిశ ఎస్‌ఓఎస్‌కు కాల్ చేసిన పది నిమిషాల్లోనే బాధితులకు పోలీసులు అండగా నిలుస్తున్నారు. దిశ యాప్ మహిళల చేతుల్లో బ్రహ్మాస్త్రంలా మారింది. ఏలూరులో దిశ పోలీస్ స్టేషన్‌తోపాటు డీఎస్పీ, సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు, 10 మంది పోలీస్ సిబ్బందిని ప్రభుత్వం నియమించి మహిళలకు అండగా నిలుస్తోంది. జిల్లాలో దిశ యాప్ డౌన్‌లోడ్స్ 14 లక్షలకు పైగా ఉండగా, దీనిలో 719528 రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇప్పటివరకు దీనికి 3,257 కాల్స్ రాగా, 350 కేసులు నమోదయ్యాయి. వీటన్నింటినీ పరిష్కరించారు.


ఏలూరు యాసిడ్ దాడి కేసులో బాధితురాలి తండ్రిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ మేరీ ప్రశాంతి (ఫైల్)

సమర్థవంతంగా ఎస్సై ఫిజికల్ పరీక్షలు

ఏలూరులో ఈ ఏడాది నిర్వహించిన ఎస్సై ఫిజికల్ పరీక్షలను పోలీసు శాఖ నిర్వహించింది. అభ్యర్థులకు మూడు దశల్లో ఫిట్‌నెస్ పరీక్షలు, రెండు రాత పరీక్షలను డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ స్వీయ పర్యవేక్షణలో సమర్థవంతంగా ముగించారు.

ముమ్మరంగా విజి'లెన్స్ తనిఖీలు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కరణం కుమార్ ప్రత్యేక పర్యవేక్షణలో జిల్లాల్లో విజిలెన్స్ తనిఖీలు ముమ్మరంగా చేశారు. ఈ ఏడాదిలో రూ.5 కోట్ల 72లక్షల విలువైన ఆయా వస్తువులు, పదార్థాలను, బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు.

సెల్‌ఫోన్ బాధితులకు ఊరట

ఏలూరు జిల్లాలో పోగొట్టుకున్న, చోరీకి గురైన సెల్‌ఫోన్లను వరుసగా పదిసార్లు భారీ ఎత్తున పోలీసులు రికవరీ చేశారు. ఖరీదైన సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు సైబర్‌క్రైమ్ సెల్‌కు వాట్సాప్‌లో ఫిర్యాదు చేస్తే చాలు వెతికిపెట్టి తెచ్చే బాధ్యత పోలీసులు తీసుకున్నారు. దీనిలో 2,522 ఫిర్యాదులు రాగా, 1325 మందికి పోగొట్టుకున్న ఫోన్లను అప్పగించారు. వీటి విలువ రూ.2.71 కోట్లుగా నిర్ధారించారు.

జిల్లాలో నమోదైన కేసుల వివరాలు

కేసులు	2021	2022	2023
హత్యలు	23	32	31
వరకట్న మరణాలు	06	08	06
హత్యాయత్నాలు	43	55	51
అత్యాచారాలు	26	29	25
డెకాయిట్	01	01	01
ఇళ్లల్లో పగటి చోరీలు	35	34	40
ఇళ్లల్లో రాత్రి చోరీలు	156	178	150
మహిళలపై నేరాలు	1072	1527	1282
పోక్సో కేసులు	64	51	35
ఎస్సీ, ఎస్టీ కేసులు	97	111	97
కిడ్నాప్ కేసులు	91	87	68
చీటింగ్ కేసులు	263	314	302
సైబర్ నేరాలు	51	75	71
రోడ్డు ప్రమాదాలు	618	633	602
ఐడీ లిక్కర్ కేసులు	1358	936	689

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి



"ఏలూరు జిల్లాలో నేరస్తుల కదలికలపైనా నిత్యం పర్యవేక్షణ ఉంటుంది. జిల్లాలో ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరు వ్యవహరించినా కఠినంగా వ్యవహరిస్తాం. ముఖ్యంగా మహిళలపై అఘాయిత్యాలు, దాడులు చేస్తే వేగంగా శిక్షలు పడేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. జిల్లాలో క్రైమ్ రేట్ తగ్గేలా చర్యలు తీసుకుంటున్నాం.

– డీ.మేరీ ప్రశాంతి , ఏలూరు జిల్లా ఎస్పీ

ప్రజలకు మెరుగైన సేవలు



ఏలూరు రేంజ్ పరిధిలో, ఏలూరు జిల్లాలో క్రైమ్ రేట్‌ను క్రమంగా అదుపు చేస్తూనే, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. గంజాయి, అక్రమ మద్యం, సారా రవాణా వంటివాటిపై కఠిన చర్యలు తప్పవు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం.

– జీవీజీ అశోక్‌కుమార్, ఏలూరు రేంజ్ డీఐజీ

నేత్రపర్వం.. శ్రీవారి గ్రామోత్సవం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా గురువారం నిర్వహించిన స్వామివారి తిరువీధి సేవ భక్తులకు నేత్రపర్వమైంది. ఉదయం ఆలయంలో అర్చకులు స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం పూజాదికాలను జరిపి హారతులిచ్చారు. తరువాత శ్రీవారి వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, గజసేవల నడుమ స్వామివారి తిరువీధి సేవ కన్నులపండువగా జరిగింది. ప్రతి ఇంటి ముంగిట భక్తులు స్వామి, అమ్మవార్లకు నీరాజనాలు సమర్పించారు. అనంతరం ఆలయ ప్రధాన కూడలిలోని ధనుర్మాస మండపంలో స్వామి, అమ్మవార్లకు అర్చకులు పూజలు జరిపి, భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అలాగే అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామివారి గ్రామోత్సవం రాత్రి క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా జరిగింది.


క్షేత్ర పురవీధుల్లో తొళక్క వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

టీడీపీ మత్తులో పవన్

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ టీడీపీ మత్తులో ఉన్నాడని డిప్యూటీ సీఎం, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. గురువారం రాత్రి ఆయన ఈ విషయంపై మాట్లాడారు. జనసేన నాయకులు పొత్తును వ్యతిరేకిస్తూ దబ్బళంతో పొడిచినా కూడా ఈ విషయంలో పవన్‌కు నొప్పి తెలియడంలేదన్నారు. చంద్రబాబు కోసమే జీవితాంతం పనిచేస్తానని జనసేనను స్థాపించిన పవన్ చెప్పడం సిగ్గుచేటన్నారు. జనసేనలో టీడీపీతో చెలిమిని వ్యతిరేకిస్తే పార్టీలో ఉండాల్సిన అవసరం లేదని, బయటకు వెళ్లిపోవచ్చని క్యాడర్‌కు పవన్‌కల్యాణ్ నిస్సిగ్గుగా చెబుతున్నారన్నారు. పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి కావడానికి జనసేన పార్టీని పెట్టలేదని, తెలుగుదేశం కోసం పనిచేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడానికి జనసేన పనిచేస్తోందన్నారు. ఇది పవన్ కల్యాణ్ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఇక జీవితంలో పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి కానప్పుడు జనసేన నాయకులు ఆ పార్టీ కోసం ఎందుకు పనిచేయాలన్నారు. పవన్ నిర్ణయం తెలుగుదేశం పార్టీని ముందుకు నడిపించేలా ఉంది కానీ, జనసేనను ముందుకు తీసుకెళ్లేలా లేదన్నారు. అటువంటి పవన్ కోసం ఆ పార్టీ నాయకులు పనిచేయాల్సిన అవసరం ఉందా అన్నారు. ఈ విషయాన్ని జనసేన తమ్ముళ్లు ఒకసారి ఆలోచించాలన్నారు. పేదల పొట్టకొట్టి పెత్తందారులకు పెట్టడం చంద్రబాబు విధానం అయ్యితే, పేదల కోసం పనిచేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విధానమన్నారు. రానున్న ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధమన్నారు. పేదలకు మంచి జరుగుతుంటే పెత్తందారుల కోసం పనిచేసే తెలుగుదేశం ఓర్వలేకపోతోందన్నారు. తెలుగుదేశం, చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ ఆ పార్టీల అనుకూలశక్తులు, ఇలా దుష్టశక్తులన్నీ కలిసి మారీచుల్లా వేషాలు మార్చి ప్రజలను మోసం చేయడానికి రకరకాల కుట్రలు పన్నుతున్నాయని అన్నారు. తెలుగుదేశం కోసం పనిచేసే పవన్‌తో వెళితే ఒద్దుకు చేరలేరన్నారు. ఐదేళ్లు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉంటాడని లోకేష్ ప్రకటించిన దానికి పవన్ కల్యాణ్ ఏం సమాధానం చెబుతారన్నారు. అయినా పవన్ కల్యాణ్ తెలుగుదేశం పార్టీని పట్టుకుని అంటకాగడం కాపు జాతికి తీరని అవమానం అన్నారు. దారితప్పి పక్కదారిలో నడుస్తున్న కాపు సోదరులకు నిజాలు చెప్పి కనువిప్పు కలిగించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని డిప్యూటీ సీఎం కొట్టు అన్నారు.


పాలకొల్లు అర్బన్ : పాలకొల్లులోని బీఆర్‌ఎంవీ స్కూల్ గ్రౌండ్‌లో వాలీబాల్ సర్వీస్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి


పెదపాడు : పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కబడ్డీ ఆడుతున్న ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

'ఆడుదాం ఆంధ్ర'తో జోష్

ఉమ్మడి జిల్లాలో 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. గురువారం పశ్చిమగోదావరి జిల్లాలోని 535 గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో నిర్వహించిన ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీల్లో 1,335 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో దాదాపు 13 వేల మంది క్రీడాకారులు పాల్గొనగా, గత మూడు రోజులుగా దాదాపు 81,860 మంది క్రీడలను తిలకించారు. అలాగే ఏలూరు జిల్లా వ్యాప్తంగా 625 సచివాలయాల స్థాయిలో 956 మ్యాచ్‌లు జరగాల్సి ఉండగా, 730 మ్యాచ్‌లు జరిగాయి. దీంతో మొత్తంగా ఆడుదాం ఆంధ్ర పోటీల మూడో రోజుకు 3,280 మ్యాచ్‌లు జరిగాయి. సుమారు 33 వేల మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, గురువారం పలు చోట్ల జరిగిన పోటీల్లో ప్రజాప్రతినిధులు పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

– సాక్షి, నెట్‌వర్క్

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వృద్ధుడి మృతి



ఏలూరు టౌన్: నూజివీడు రైల్వే స్టేషన్‌లో రెండో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీసులకు గురువారం రాత్రి అందిన సమాచారంతో రైల్వే హెచ్‌సీ నంబూరి ఆదినారాయణ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు సుమారు 65 నుంచి 75 సంవత్సరాలు వయస్సు, నలుపు రంగు శరీరం, 5.5 ఎత్తు కలిగి ఉన్నాడు. తెలుపు, నీలం, నలుపు చారల చొక్కా, నీలం, తెలుపు, నలుపు గళ్ల లుంగీ, గంధం రంగు స్వెటర్ ధరించి ఉన్నాడు. చొక్కా కాలపై టైలర్ మార్కుగా జీఎస్‌రావు తణుకు అని లేబుల్ ఉంది. మృతుడు పశ్చిమగోదావరి జిల్లా ప్రాంతానికి చెందిన వాడై ఉంటాడని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు జీజీహెచ్‌కు గురువారం తరలించారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు ఏలూరు రైల్వే హెడ్ కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ 80740 55378 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

● గడపగడపకు సంక్షేమం


భీమడోలు: భీమడోలు బీసీ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

నకిలీ కరెన్సీ స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నకిలీ కరెన్సీని ప్రదర్శిస్తున్న పోలీసులు

కొయ్యలగూడెం: నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ విజయబాబు గురువారం సాయంత్రం పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్లో ఎస్ఐ జీజే విష్ణువర్ధన్ తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ద్వారకాతిరుమల మండలం చెందిన ఒక వ్యక్తి నుండి మూడు లక్షల రూపాయలు అసలు నగదు ఇస్తే 14 లక్షల రూపాయల నకిలీ కరెన్సీ ఇస్తామని నలుగురు వ్యక్తులు ఒప్పందం కుదుర్చుకున్నారని అన్నారు. ఒప్పందం మేరకు కొయ్యలగూడెం సమీపంలోని ఓ దాబా హోటల్ వద్ద నిందితులు కరెన్సీని మార్చుకునే సమయంలో తమకు ముందుగానే వచ్చిన సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు మరియు పోలీసు సిబ్బందితో కలసి ఆకస్మిక దాడిలో కొందరు పారిపోగా, ఏలేటి చంద్ర శేఖర్, దిరిసిపాము వెంకటేష్, చిట్ల నాగరాజు, గొల్లపల్లి ముత్తయ్య పట్టుబడ్డారని, వీరిని విచారణ చేస్తున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి 13 లక్షల 96 వేల చిల్డ్రన్ కరెన్సీని, అదేవిధంగా 4 వేల రూపాయల అసలు నోట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నలుగురు నిందితులతో పాటు వారికి సంబంధించిన కారును సీజ్ చేసి స్టేషన్‌కి తరలించామని, విచారణ అనంతరం మరిన్ని వివరాలు వెల్లడి చేస్తామని చెప్పారు.

220 కేజీల గంజాయి పట్టివేత

జంగారెడ్డిగూడెం: జీలుగుమిల్లిలో రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద బుధవారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో ఓ లారీలో అక్రమంగా రవాణా చేస్తున్న 220 కేజీల గంజాయిని పట్టివేసినట్లు ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు చెప్పారు. జంగారెడ్డిగూడెం ఎస్ఈబీ స్టేషన్‌లో వివరాలను ఎస్ఈబీ ఏఎస్పీ గురువారం విలేకరులకు వెల్లడించారు. ఏలూరు జిల్లా టాస్క్‌ఫోర్స్‌కు అందిన సమాచారం మేరకు సీఐ ధనరాజు, జంగారెడ్డిగూడెం ఎస్ఈబీ సీఐ బి.శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి జీలుగుమిల్లి సరిహద్దు చెక్‌పోస్టు వద్ద బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో లారీలో 110 గంజాయి ప్యాకెట్లను అక్రమంగా రవాణా చేస్తున్న గుర్తించారు. మొత్తం 220 కేజీల గంజాయి, లారీ స్వాధీనం చేసుకుని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులను విచారణ చేయగా, ఉల్లిపాయ లోడుతో మహారాష్ట్ర నుంచి వరంగల్‌లో అన్‌లోడ్ చేశారన్నారు. అక్కడ ఔరంగబాద్‌కు చెందిన దీపక్, అమర్ అనే వ్యక్తులతో లారీ ఓనర్ కమ్ డ్రైవర్ అయిన అహ్మద్‌నగర్‌కు చెందిన సందీప్ శంకర్‌సరప్, హెల్పర్ ప్రకాష్ ధూత రాథోడ్ గంజాయి రవాణాకి సంబంధించి కిరాయి మాట్లాడుకున్నారు. రాజమండ్రికి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో గుర్తు తెలియని ప్రాంతంలో గంజాయి ముఠా సభ్యుడు లోడింగ్ ప్రక్రియ పూర్తి చేశాడు. అక్కడ నుంచి తెలంగాణ వైపు వెళుతుండగా జీలుగుమిల్లి చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి లారీ ఓనర్ కమ్ డ్రైవర్ అయిన అహ్మద్‌నగర్‌కు చెందిన సందీప్ శంకర్‌సరప్, హెల్పర్ ప్రకాష్ ధూత రాథోడ్‌లను అరెస్టు చేసినట్లు సూర్యచంద్రరరావు తెలిపారు. డీటీఎఫ్ సీఐ ధనరాజ్, జంగారెడ్డిగూడెం ఎస్ఈబీ సీఐ శ్రీనివాసరావు, ఎస్సైలు మస్తానయ్య, ఆదినారాయణరావు, రామ్‌ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.


జంగారెడ్డిగూడెం ఎస్ఈబీ స్టేషన్‌లో పట్టుకున్న గంజాయి, నిందితులతో ఎస్ఈబీ అధికారులు

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు పవర్‌పేట సమీపంలో వేగంగా వెళ్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు పశ్చిమబెంగాల్‌కు చెందిన యువకుడు జారిపడి సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. పశ్చిమ బెంగాల్ ముషీదాబాద్ మదనపూర్ ప్రాంతానికి చెందిన నిజరుల్ షేక్ (24) అతని సోదరుడు కలిసి కేరళలోని యర్నాకుళం నుంచి హౌరాకు కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నారు. గురువారం రైలు ఏలూరు మీదుగా వెళ్తుండగా ఏలూరు పవర్‌పేట సమీపంలోని చిట్టివలస పాలకల వద్ద సిజరుల్ షేక్ బోగీ గుమ్మం వద్ద నుంచి ప్రమాదశాత్తు జారిపడి మృతి చెందాడు. అదే రైలులో ఉన్న తన సోదరుడు గుర్తించి ఏలూరు రైల్వే పోలీసుకు సమాచారం ఇచ్చారు. గురువారం మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఏలూరు రైల్వే ఎస్సై డి.నరసింహారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వర్జీనియాలో తెగుళ్లను నివారించండి


వర్జీనియా పంటను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం వర్జీనియా వేలం కేంద్రం-1, -2 పరిధిలోని పలు గ్రామాలలో వర్జీనియా క్షేత్ర మిత్ర బృందం గురువారం పర్యటించింది. పొగాకు బోర్డు అధికారులు, సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు, వివిధ కంపెనీల ప్రతినిధులతో కూడిన ఈ బృందం బుట్టాయిగుడెం, మర్రిగుడెం, సూరపవారిగుడెం, రెడ్డిగణపవరం, వేగవరం, చల్లావారిగుడెం, జీలుగుమిల్లి ప్రాంతాల్లో ఇటీవల మిచాంగ్ తుపాను వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించింది. పంటను సంరక్షించుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు పలు సూచనలు చేశారు. కాండం కుళ్లు తెగులు సోకి చనిపోయే స్థితిలో ఉన్న పొగాకు మొక్కలు కోలుకునే అవకాశం లేదన్నారు. కొత్తగా ఈ తెగులు సోకకుండా అమిస్టార్ లేదా కాబ్రియెటాప్ మందును 10 లీటర్ల నీటికి 10 గ్రాముల చొప్పున కలిపి మొక్కల మొదలు తడిచేటట్టుగా పిచికారీ చేయాలన్నారు. సీటీఆర్ఐ శాస్త్రవేత్త డా.వై.సుబ్బయ్య పొగాకు బోర్డు ప్రాంతీయ అధికారి ఎం.ఆదిశేషయ్య పీఎస్ఎస్‌హెచ్ కంపెనీ లీఫ్ మేనేజర్ జె.రఘు వేలం కేంద్రాల నిర్వహణాధికారులు బి.శ్రీహరి, జె.సురేంద్ర, ఐటీసీ ఎం.చారువాక, జీపీఐ జె.కల్యాణ్ పవన్, ఏకే దాస్, పొగాకు రైతులు పాల్గొన్నారు.